




(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

"స్వప్నిక గురించా? ఏమిటి విషయం? ఏదైనా కొత్త సంగతి తెలిసిందా? ట్రీట్మెంట్ గురించా?" డా.రాజేష్.

'కేన్సర్ వ్యాధిపైన జరిగే రిసెర్చ్ గురించి కొత్త విషయాలని ప్రతినిత్యం తెలుసుకుంటూ, ఆంకాలజీ ( Oncology కేన్సర్ కి సంబంధించిన శాస్త్రం) రంగంలో వెలువడే కొత్త పరిశోధనా పత్రాలను, ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను అనుదినం గమనించే మిత్రుడు ఏదైనా కొత్తది తెలుసుకున్నాడా? దానివల్ల స్వప్నిక కి ఏదైనా లాభం జరుగుతుందేమో!' అని చాలా ఆశపడ్డాడు డా రాజేష్ ఒక్క క్షణం.

అదే మాట అడిగాడు.

"కేన్సర్ రిసెర్చ్ ఒక అనంతవాహిని. ప్రపంచవ్యాప్తంగా రోజూ ఎన్నో కొత్తవిషయాలు తెలుస్తూనే ఉంటాయి. దాన్ని పూర్తిగా రూపు మాపగలిగే రోజు కోసమే మాలాంటి స్పెషలిస్ట్ లేకాక, మన వైద్య లోకమంతా ఎదురుచూస్తూనే ఉంటాం, ఆ విషయం నీకు తెలియనిది కాదు. "

"ఇప్పుడు నేను చెప్పాలనుకున్నది దానిగురించి కాదు. స్వప్నిక గురించి, ఆమె ట్రీట్మెంట్ కయ్యే ఖర్చు గురించి" రవ్వంత ఆనందం మిళితమైన స్వరంతో చెప్తూ ఊపిరి తీసుకోవడానికి ఒక్క క్షణం ఆగాడు డా.సుజిత్.

ఎప్పుడూ ఎక్కువగా మాట్లాడని స్నేహితుడు ఆవిధంగా మాట్లాడడం చూసి

" అదేమిటో త్వరగా చెప్పు మరి!" అన్నాడు డా.రాజేష్.

" అదే చెప్తున్నా. అన్నీ నేను అనుకున్నట్టు జరిగితే ఆమె చికిత్స సులభతరం అయ్యే అవకాశం ఒకటుంది. దానికయ్యే పూర్తి ఖర్చు కాకపోయినా కనీసం సగమో, మూడువంతులో దొరికినా సంతోషమే కదా! " అన్నాడు ఆయన.

ఆ మాటలతో డా.రాజేష్ కి కూడా ఉత్సాహం వచ్చింది.

" ఏమిటది? విషయమేమిటో వివరం గా చెప్పు మరి. నా పేషెంట్ల లో ప్రత్యేకమైన పాప స్వప్నిక, ఆ పాపకి ఏరకమైన మేలు జరిగినా నాకన్నా సంతోషించేవాడు మరొకడు ఉండడు" అన్నాడు డా.రాజేష్.

"తెలుసురా మై ఫ్రెండ్! అందుకే నీకింత అర్జంట్ గా ఫోన్ చేసింది.

ఈ మధ్యనే నేను వెళ్ళిన ఒక కాన్ ఫరెన్స్ లో ఒక మిత్రుడు చెప్పాడు ఒక ప్రత్యేకమైన ఫౌండేషన్ గురించి.

కేన్సర్, లేదా ఇతర ప్రాణాంతక వ్యాధుల చికిత్సలకి పేషెంట్ లకి వివిధ రకాల సహాయాలని అందించే ప్రభుత్వేతర సంస్థలు ( ఎన్.జీ.వో లు) ఉంటాయని నీకు తెలిసినదే కదా. అలాంటి ఒక సంస్థ గురించి అన్నమాట ఇది కూడా." అంటూ చెప్తున్న మిత్రుడిని మధ్యలోనే ఆపి

" కానీ, వారి దగ్గరకి సహాయం కోసం వెళ్ళే వారి లిస్ట్ కూడా చాలా పెద్దదే ఉంటుంది కదా. ఎన్ని రకాల రికమెండేషన్లు, తెల్సిన వారిద్వారా వెళ్ళడాలూ ఇలాంటివన్నీ కూడా మనకి తెలిసినవే కదా" అన్నాడు, డా.రాజేష్.

" కరక్ట్. బాగా తెలిసినవి, పెద్దవి అయిన సంస్థల్లో అవన్నీ చాలా సాధారణంగా జరిగేవే. కానీ ఇది కొద్దిగా విభిన్నమైనది. నిజానికి ఒక కుటుంబం వారు ప్రైవేట్ గా తమ ఫేమిలీ ట్రస్ట్ లా నడుపుతున్న సంస్థ. అందుకని ఇంకా చాలా మందికి తెలియదు. పైగా వారు తీసుకునే నిర్ణయాలన్నీ ఆ కుటుంబ పెద్ద, తన పిల్లలిద్దరితో కలిసి తీసుకుంటారుట, అందుకని వారికి సబబైనదిగా అనిపిస్తే సహాయం అందడం కూడా తరగా జరుగుతుందన్నమాట. కానైతే ఇది పూర్తిగా వాళ్ళ స్వంత డబ్బుతో నడుపుతున్న సంస్థ కనుక సంవత్సరానికి పరిమితంగా మాత్రం సహాయం చెయ్యగలరుట. అది కేన్సర్ పేషెంట్లకే కావడం మనకి కలిసి వచ్చే విషయం. మన, అదే స్వప్నిక అదృష్టం బావుంటే, తనకి కావలసిన సహాయం దొరకవచ్చు. అది చెప్పాలనే నీకు కాల్ చేశాను" అన్నాడు డా. సుజిత్.

"మనం వీలైనంత త్వరగా వారిని కలిసి, స్వప్నిక కేస్ అంతా వివరించి సహాయం గురించి అడిగితే వారు తప్పకుండా పాజిటివ్ గా స్పందిస్తారని నాకు అనిపిస్తోంది. అలాగే ఇతర మార్గాలేమైనా ఉంటే కూడా చెప్తారు కూడా" అన్నాడాయన.

"ఇతర మార్గాలంటే?" రాజేష్ అడిగాడు.

" వారికి చాలా కేన్సర్ హాస్పిటల్స్, రిసెర్చ్ సెంటర్లతో చాలా పరిచయాలు ఉన్నాయి. దానివల్ల మనకి గ్లీవెక్ (గత ఇరవై సంవత్సరాలుగా బ్లడ్ లేదా బోన్ మేరో కేన్సర్ ల చికిత్స కి దొరికిన మిరకిల్ డ్రగ్ అనేది) లాంటి ఆధునిక చికిత్సలకి సంబంధించిన సహాయం దొరికే వెసులుబాటు కూడా ఉండవచ్చు. ఒకవేళ వాళ్ళు పూర్తిగా సహాయం చేస్తే మాత్రం మనం నిజంగా లక్కీ. ఇద్దరు డాక్టర్ల రికమెండేషన్ మన ఫేవర్ లో వర్క్ అవుతుందేమో అని నా ఆశ" అన్నాడు డా. సుజిత్.

"ఎలాగో ఒకలా మన స్వప్నిక కి సహాయం దొరికితే చాలు, అదే మనకి కావలసినది" స్నేహితుడి మాటలు ఎంతో సంబరంగా వింటూ సంతోషంగా అన్నాడు డా.రాజేష్.

" కరక్ట్! వారితో అపాయింట్ మెంట్ తీసుకోవాలి మనం. నేను నా మిత్రుడి ద్వారా ప్రయత్నిస్తాను. దొరికిన వెంటనే నీకు చెప్తాను. నువ్వు ఈలోపు కిరణ్ కి విషయం చెప్పు. ఉంటాను, విషయం తెలిసిన వెంటనే కాల్ చేస్తాను". అంటూ సంభాషణ ముగించాడు డా.సుజిత్.

మిత్రుడి మాటలతో కొండంత ఉత్సాహం వచ్చింది రాజేష్ కి. ఈ స్పాన్సర్స్ గురించి తెలియడం నిజమా ఒక శుభ పరిణామం.

తను సూచించిన క్రౌడ్ ఫండింగ్ వల్ల వస్తున్న నిధులు ఎంతవరకూ జమ అవుతాయో చెప్పలేని పరిస్థితి. కిరణ్, రాధిక ల ఆర్థిక స్థితిగతులూ అంతంత మాత్రమే. అలాంటి పరిస్థితిలో ఇలాంటి సంస్థ/ఫౌండేషన్ గురించి తెలియడం చాలా ఆశాజనకంగా అనిపించింది అతనికి.

దిక్కుతోచని ప్రయాణంలో దొరికిన చిన్న ఆలంబనలా తోచింది.

స్వప్నిక అన్నా, ఆమె తల్లితండ్రులన్నా తనకున్న ప్రత్యేకమైన అభిమానాన్ని తన స్నేహితుడు గుర్తుంచుకుని ఈ కేస్ ని స్పెషల్ గా అనుకోవడం కూడా అతనికి ఎంతో ఆనందాన్నిచ్చింది.

ఈ విషయాలన్నీ ముందు తన భార్య స్నేహ కి చెప్తే బావుంటుందనిపించి ఆమెకు కాల్ చేశాడు.

" హలో డాక్టర్! ఏమిటి విషయం? పనివేళల్లో గుర్తొచ్చానే ఈ రోజు? చిత్రమే! " అంది నవ్వుతూ.

"అవును డాక్టర్ మేడం గారు. విషయమే అలాంటిది" అన్నాడు తాను కూడా అదే శ్రుతిలో.

" చాలా హేపీగా ఉన్నారు, ఏమిటి విషయం?" అందావిడ నవ్వుతూ.

"మంచి విషయమే!" అంటూ స్నేహితుడు సుజిత్ చెప్పిన విషయాలన్నీ వివరంగా, అక్షరం మరిచిపోకుండా, మార్చకుండా చెప్పాడు.

సంగతి తెలుసుకున్న స్నేహ కూడా చాలా ఉత్సాహ పడింది.

" వెరీ గుడ్, అలా మనం అనుకున్నట్టు జరిగితే అంతకన్నా కావలసినదేముంది. ఫేమిలీ ట్రస్ట్ ఫౌండేషనా?" ఎక్కడ ఉంది? మన ఊరిలోనేనా? ఎవరు దాని ఓనర్స్? ఇలాంటి వివరాలేమైనా చెప్పారా?" అంటూ అడిగింది.

" లేదు, వాడు చెప్పిన విషయం విన్న ఉత్సాహం లో నేనూ అడగలేదు. మళ్ళీ కాల్ చేసి కనుక్కోవచ్చులే" అన్నాడాయన.

" కరక్ట్, కానీ కిరణ్, రాధికలకి విషయం చెప్పేముందు మనం వివరాలన్నీ తెలుసుకోవడం ముఖ్యం". అంది స్నేహ.

" నిజమే, వీలైనంత తొందరలో మనం వాళ్ళని కలిసే మార్గం చూస్తానన్నాడు సుజిత్" అన్నాడు రాజేష్

" ముందు ఆ ట్రస్ట్ వివరాలు తెలుసుకోండి. వారికి మనం తెలియదు, మనం వాళ్ళకి తెలిసి ఉంటామని అనుకోను. అలాంటప్పుడు మన కేస్ వాళ్ళెందుకు పరిగణిస్తారు? ఎందుకు పరిగణిస్తారు అనేకంటే ఎందుకు పరిగణించాలి? మనకేమీ రికమెండేషన్ లేదు, అసలే రెండు-మూడు కేసులకన్నా సహాయం దొరకడం కష్టం అంటున్నారు. అలాంటప్పుడు మనం ఏం చేస్తే మన స్వప్ని కేస్ వాళ్ళు ముఖ్యమైనదిగానూ, సహాయం ఇవ్వవలసినదిగానూ భావిస్తారో, అలా వారు అనుకోవడానికి మనం ఏం చెయ్యాలో తెలుసుకోవాలి. దానికి కావలసిన పేపర్ వర్క్ అవీ తయారు చెయ్యాలి కదా!" అంది ఆవిడ.

సంతోషమైనా, బాధైనా అన్నింటికీ త్వరగా స్పందించడం తన లక్షణమైతే, స్పందించడంతో పాటు జరగవలసిన విషయాలని కూడా గమనించడం, దానికి తగ్గట్టుగా ప్లాన్ చెయ్యడం మొదట్నుంచీ స్నేహ కున్న లక్షణం.

ఇప్పుడు కూడా అంతే.

స్నేహితుడు చెప్పిన మంచి మాటల మత్తులో పడి ఏమీ కనుక్కోలేదు తను. వివరాలు తర్వాతైనా తప్పక తెలుస్తాయి కానీ అది ఆక్షణంలో కనుక్కోవాలని తనకి తోచలేదు.

సరిగ్గా ఇలాంటి విషయాల్లోనే స్నేహ ఎంతో నచ్చుతుంది డాక్టర్ రాజేష్ కి.

"నువ్వన్నది నూటికి నూరుపాళ్ళూ నిజం స్నేహా. ఎప్పటిలాగే ప్రాక్టికల్ థింకింగ్ నీది" మెచ్చుకోలుగా అన్నాడు భార్యతో.

నవ్విందావిడ భర్త మాటలకి.

“అయితే డా.సుజిత్ చెప్పే వివరాల కోసం ఎదురుచూద్దాం. మనకి కాస్త క్లారిటీ వచ్చాకా కిరణ్, రాధికలకి ఈ విషయం చెప్తే మంచిదేమో కదా. వెంటనే చెప్పి ఆత్రుత పెట్టడం కంటే?" అంది.

" నిజమే, కనీసం సుజిత్ నించి తర్వాతి వివరాలు వచ్చేవరకూ వేచి ఉందాం" అన్నాడు డా. రాజేష్.

ఆతర్వాత మరో రెండు మూడు నిమిషాలు తమ విషయాలు మాట్లాడుకుని తమ ఫోన్ సంభాషణ ముగించారు ఆ దంపతులు.

ముగించే ముందు డా. రాజేష్ భార్యతో  అన్నాడు.

" ఇందాకా సుజిత్ తో మాట్లాడుతూ ఇద్దరు డాక్టర రికమెండేషన్లతో వెళ్ళే స్వప్నిక కేస్ ప్రత్యేకమైనది అవుతుందేమో అన్నాడు సుజిత్.  నీతో కలిపి ముగ్గురు డాక్టర్ల రికమెండేష తో వెళ్ళే ఈ కేస్ నిజంగా ప్రత్యేకమైనదే అవుతుంది.  పాపకి తగిన సహాయం అందుతుందని నాకెంతో నమ్మకంగా అనిపిస్తోంది"

భర్త మృదు స్వభావం తెలిసిన స్నేహ కూడా " నిజమే, అలాగే అవుతుందని, అవ్వాలని కోరుకుందాం" అంది ఫోన్ పెట్టేస్తూ.

డా. సుజిత్ కూడా స్నేహలా ఆలోచించే వ్యక్తే.

ఆ ట్రస్ట్, దాని అధిపతుల వివరాలు వివరాలన్నీ తన స్నేహితుడితో మాట్లాడి తెలుసుకున్నానని, ఆపైన వాళ్ళని కలిసేందుకు అపాయింట్ మెంట్ తీసుకుంటాను అని మెసేజ్ చేశాడు.

ఆవివరాలన్నీ మర్నాడు సాయంత్రం కలిసి చెప్తానని చెప్పాడు.

అలాగే స్వప్నిక కేస్ కోసం ఒక ప్రత్యేకమైన ఫైల్ తయారు చేద్దామని, దానిలో ఆ అమ్మాయి ఇప్పటివరకూ సాధించిన విజయాలు. తాను అనుకున్నట్టుగా జరిగితే మన దేశాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టడానికి ఆమెకున్న అవకాశాలు, తనకు సోకిన వ్యాధి లక్షణాలు, వారి కుటుంబ స్థితిగతులూ ఇలాంటి వివరాలన్నీ పొందుపరచడం ఇలాంటివన్నీ తాను చేస్తానని' ఆ మెసేజ్ లో తెలిపాడు.

ఆ మెసేజ్ చదువుకున్న రాజేష్ ఆనందానికి అవధులు లేవు.

అప్పుడే స్వప్నిక కి సహాయం దొరికినట్టుగా భావించాడు.

క్షణం ఆలస్యం చెయ్యకుండా ఆ మెసేజ్ ని రకరకాల 'ఇమోజీ ఐకాన్ లు' కలిపి మరీ భార్య స్నేహకి ఫార్వార్డ్ చేశాడు

ఆమె కూడా చిరునవ్వు ఇమోజీ తో స్పందన తెలిపింది.

కిరణ్ కి చూచాయగా విషయం చెప్పమని, సుజిత్ తమని కలిసి విషయం చెప్పాకా, పూర్తి వివ్వరాలు చెప్తామని చెప్పమని భర్త కి సలహా ఇచ్చింది.

శేఖర్ వరకూ చెప్పినా పరవాలేదు కానీ, రాధిక, రోహిణి లకి పూర్తి విషయం తెలిసాకా చెప్పడమే మంచిదన్న నిర్ణయానికి ముందే వచ్చారు ఆ డాక్టర్ దంపతులు.

ఆ ప్రకారమే డా.రాజేష్ కిరణ్ కి ఫోన్ చేసి క్లుప్తంగా విషయం చెప్పాడు.

"సుజిత్ రేపు కలిసి ఆ ట్రస్ట్ వివరాలు, అవీ చెప్తాను అన్నాడు, అలాగే మనం వారిని త్వరలోనే కలిసి మాట్లాడే అవకాశం కోసం కూడా ప్రయత్నం చేస్తాడు. సుజిత్ వచ్చే టైం మీకు మెసేజ్ చేస్తాను. మీరు ఒక్కరో లేదంటే మీ మిత్రుడు శేఖర్ తో కలిసి కానీ వస్తే మీకు కూడ తెలుస్తుంది. మనకి కొద్దిగా క్లారిటీ వచ్చాకా ఆడవారికి చెప్తే బావుంటుంది అనుకున్నాం నేనూ, స్నేహా. ముఖ్యంగా రాధిక గారికి, ఆమె తల్లి మనసుకు ఇప్పటినించే ఆశలు కల్పించడం ఎందుకు కదా అని" అంటూ చెప్పాడు.

ఆ మాటలకే కిరణ్ ఎంతో సంతోషించాడు.

" థాంక్ యూ డాక్టర్, మీరెలాగంటే అలాగే. శేఖర్ నా బహిప్రాణం. వాడిని తప్పక తీసుకుని వస్తాను, మీ మెసేజ్ కోసం ఎదురు చూస్తూ ఉంటాను. సడన్ గా నాకు ఏనుగెక్కినంత సంబరంగా ఉంది." మాటలు దొరకక మూగపోయాడు కిరణ్.

విషయం తెలిసిన నలుగురూ డా. సుజిత్ రాకకోసం, ఆయన చెప్పబోయే విషయం కోసం ఆత్రుతగా ఎదురుచూడసాగారు.

ఈ పరుగు వచ్చే నెలదాకా

Post your comments